క్లుప్తంగా

నేడు వంగరకు కలెక్టర్

వంగర: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి కలెక్టర్ నాగలక్ష్మి హాజరు కానున్నారు. ఇదే విషయమై ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశమై, శాఖల వారీగా అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్షించారు. మండలంలోని ప్రజలకు సమస్యలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశిభూషణరావు, ఏవో త్రినాథ్, ఈవోపీఆర్‌డీ జి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి

రేగిడి: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్యామలాకుమారి సూచించారు. గురువారం మండలంలోని బూరాడ, లక్ష్మీపురం గ్రామాల్లో నిర్మాణ దశలోని సచివాలయ భవనాలను ఆమె పరిశీలించారు. మండలంలో 25 గ్రామ సచివాలయ భవనాలకు గాను రేగిడి, ఉనుకూరు సచివాలయాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, మిగిలిన వాటిలో 15 భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. మరో 8 చోట్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని పూర్తిచేసే బాధ్యతను ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అప్పగించామన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 65 మంది ఎంపిక

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్ కంటి వెలుగు పథకం, తిరుపతికి చెందిన నవజీవన సేవా సంస్థ ఆర్థిక సహాయంతో స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వైద్య విభాగం సిబ్బంది శిబిరానికి హాజరైన 120 మంది రోగులకు నేత్రవైద్య తనిఖీలు చేశారు. 65 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామారావు తదితరులు పాల్గొన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

బాడంగి: మండలంలో గురువారం నాటికి సామాజిక పింఛన్ల పంపిణీ 94 శాతం మేర పూర్తయినట్లు ఏవో వేణుగోపాలస్వామి గురువారం తెలిపారు. తొలిరోజు 80 శాతం మేర పంపిణీ చేయగా, రెండో రోజు మరో 14 శాతం మేర పింఛన్లు అందజేశామన్నారు.

తెర్లాం: మండలంలోని 21 గ్రామసచివాలయాల పరిధిలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ రెండో రోజైన గురువారమూ కొనసాగింది. ఒకటో తేదీన అందుబాటులో లేని వారి ఇళ్లకు గ్రామ వలంటీర్లు వెళ్లి, పింఛన్ డబ్బులు అందజేశారు. పింఛన్ల పంపిణీని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పరిశీలించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సంతకవిటి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సంతకవిటి–హొంజరాం ప్రధాన రోడ్డులో ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు అపరాద రుసుం విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

పన్నులు చెల్లించేందుకు ముందుకు రావాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంటి పన్ను, ఆస్తి పన్ను వసూలు చేసేందుకు ముందుకు రావాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎం.వి.నాగరాజు కోరారు. గురువారం స్థానిక పట్టణంలోని పలు దుకాణాల వద్ద పన్నుల వసూలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తామని, పన్నులు చెల్లించాల్సిన వారు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బొబ్బిలి: నందెన్న ఉత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని తారకరామ కాలనీలో మహిళలు గురువారం దీపారాధన చేశారు. శివలింగాకారంలో ప్రమిదల్లో దీపాలు వెలిగించి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు

బాడంగి: గౌరీపౌర్ణమి పురస్కరించుకుని, మండలంలోని పలు గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏటా నాగులచవితి వరకు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ కాగా, ప్రతిరోజూ నందెన్నపై కొలువైన గౌరీదేవి సమేత పార్వతీపరమేశ్వరులకు భక్తులు విశేష పూజలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నందెన్న అనుపోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు మరింత మేలు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేసి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: వైఎస్సార్ సీపీతోనే పేద ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరికతోట గ్రామంలో జాగాన వీధి, బీసీ కాలనీలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయంలో దోపిడీ పాలన జరిగిందని, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నా చేయడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అభివృద్ధి అంటే టీడీపీ అధినేతలా దోచుకోవడం, దాచుకోవడం కాదని, పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు తీసుకురావడమన్నారు. రెండేళ్ల కరోనా కష్టకాలంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాల అమలు ఆగలేదన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు అమలు చేయడంతో పాటు మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో దాదాపు 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కంటి చికిత్స కోసం తాత్కాలిక బెయిల్‌పై బయటకు వస్తే, టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వారు చేస్తున్న వింత చేష్టలు చూసి, జనం నవ్వుకుంటున్నారన్నారు.

ఆరోగ్య సమస్యలున్నాయని కోర్టుకు చెప్పడంతో మానవతా దృక్పథంతో వైద్యం చేయించుకునేందుకు కోర్టు తాత్కాలిక బెయిల్ ఇచ్చిందే తప్ప శాశ్వతంగా బెయిల్ ఇవ్వలేదన్న విషయం గుర్తుంచుకోవాలి. టీడీపీ నాయకులు ఎన్ని సంబరాలు చేసుకున్నా ప్రజల విశ్వాసం పొందలేరన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ పక్షాన ఉన్నారని, 2024 ఎన్నికల్లో 175కి 175 సీట్లు గెలవడం ఖాయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండల ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, మండల పార్టీ కన్వీనర్ అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, వైస్ ఎంపీపీలు పెంకి అరుణ, సర్పంచ్ పెంకి పుష్పమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు మీసాల ప్రసాదరావు, ఎంపీడీవో రమామణి తదిరులు పాల్గొన్నారు.

ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు



సంతకవిటి: కృష్ణశాస్త్రులపేటలో గడప గడపకూ వెళ్లి, ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని గరికిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణశాస్త్రులపేట, సోమన్నపేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే ప్రజల తపనన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందని, దీంతో అర్హులందరికీ న్యాయం జరుగుతోందన్నారు. ఏ ఇంటికి వెళ్లి, అడిగినా తమకు పథకాలు అందడం లేదన్న మాట లేదని, ఏదో ఒక పథకం ప్రతీ ఇంటికీ అందుతూనే ఉందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు, రుణాలు అందేవన్నారు. ఇప్పుడు అలా కాదన్నారు. అందరికీ పథకాలు ఇంటివద్దకే వచ్చి చేరుతున్నాయన్నారు. నీరు–చెట్టు పథకం పేరిట నాడు టీడీపీ రాష్ట్ర ఖజానాను దోచుకుందన్నారు. టీడీపీకి మళ్లీ అవకాశం ఇస్తే ఈ సంక్షేమ పథకాలన్నీ కనుమరుగవుతాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, టీడీపీ, ఆ పార్టీ నాయకులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, సర్పంచ్ యడ్ల రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ గంర్రెటి కేసరి, స్థానిక నాయకులు పైల వెంకటనాయుడు, పొగిరి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ, ఆర్‌బీకే భవనాల ప్రారంభం



అలజంగి గ్రామసచివాలయ భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనంతో పాటు, శివడవలస గ్రామంలో సచివాలయ, ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం) భవనాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు నిర్విరామంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేయడం జరుగుతోందన్నారు. ప్రజలు గతంలో ఎన్నడూ చూడనన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ హయాంలో చూస్తున్నారన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఒకప్పుడు ఏదైనా అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా, రేషన్, ఆధార్‌కార్డులు కావాలన్నా మండల కేంద్రంలోని అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదన్నారు. ఉన్న ఊరిలోనే అన్ని సేవలు అందుతున్నాయన్నారు. ప్రతీ వర్గానికి మేలు జరిగేలా సీఎం జగనన్న పాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వానికి ప్రజలు పట్టంగడతారని, మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, సర్పంచ్ రేజేటి భద్రమ్మ, ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.32 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు



కుళాయిల ఏర్పాటు పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులకు వైస్ ఎంపీపీ నక్క వర్ధిణి, సర్పంచ్ తవిటమ్మ గురువారం భూమిపూజ చేశారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా రూ.1.32 కోట్ల వ్యయంతో ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా కుళాయిలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు చొరవతో ఈ పనులకు నిధులు మంజూరయ్యాయని, వారికి గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నక్క ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి దిలీప్, వీఆర్‌వో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో ఉపాధి పనుల గుర్తింపు



గ్రామసభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు

రేగిడి: గ్రామసభల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపు చేపట్టాలని వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు కోరారు. మండలంలోని బూరాడ గ్రామ సచివాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ పనులు చేయడం అవసరమో వేతనదారులు, గ్రామస్తులు అధికారులకు తెలియజేయాలన్నారు. రైతుల పంటల సాగుకు ఉపయోగపడేలా సాగునీటి కాలువలు, చెరువుల అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామలాకుమారి, సర్పంచ్ వి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి



వీఏఏలతో సమావేశమైన ఏవో శిరీష, జెడ్పీటీసీ రామారావు

బాడంగి: ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.శిరీష వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లకు సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలతో సమావేశమైన ఆమె ఖరీఫ్ ధాన్యం కొనుగోలు, ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 15వ తేదీలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని, ఒక్కో ఆర్‌బీకే నుంచి ధాన్యం రవాణాకు 10 నుంచి 20 వాహనాల వరకు అవసరం కావొచ్చన్నారు. ఆర్‌బీకేల్లోని తేమశాతం కొలిచే యంత్రాల పనితీరును సరిచూసుకోవాలన్నారు. జెడ్పీటీసీ రామారావు మాట్లాడుతూ ధాన్యం రవాణాకు గ్రామాల్లోని ట్రాక్టర్ల డ్రైవర్లు ముందుకు రాకపోతే ప్రత్యామ్నాయంగా లారీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యంమిల్లుల వ్యాపారులే గోనెసంచులు సరఫరా చేస్తారన్నారు. మండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 8,038 ఎకరాల్లో వరి సాగు జరిగిందని, తినడానికి మినహాయిస్తే దాదాపు 16 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలు జరిగే అవకాశం ఉందన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో బ్రహ్మాజీ

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలను డిప్యూటీ ఈవో పి.బ్రహ్మాజీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తరగతుల వారీగా వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను గమనించి, పలు సూచనలు చేశారు. అనంతరం మరమ్మతులకు గురైన తరగతి గదుల విషయమై ఎంఈవో లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుడు చిన్నారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రెడ్డి శిరీషలతో కాసేపు మాట్లాడారు. ఆయన వెంట పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు, ఎంపీటీసీ కర్రి చిన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

తెర్లాం: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఎంఈవో జె.త్రినాథరావు సూచించారు. మండలంలోని వెలగవలస గ్రామ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలు, విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతోగానో కృషి చేస్తోందని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, వర్క్‌బుక్స్ అందజేస్తోందన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు వర్క్‌బుక్స్ రాసేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు.

పాఠశాల సందర్శన



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డైట్ లెక్చరర్ నాగేశ్వరరావు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని వేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ ప్యానల్ టీమ్ సభ్యులు గురువారం సందర్శించారు. ఏడుగురు సభ్యులతో కూడిన బృందం పాఠశాలలోని విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సౌకర్యాలు, వారి విద్యాసామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతీ సౌకర్యం వారికి అందేలా చూడాలని, వారి విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సభ్యులు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో పి.బ్రహ్మాజీరావు, డైట్ లెక్చరర్ నాగేశ్వరరావు, ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గ్రామగ్రామాన ఏర్పాటైన వైద్య శిబిరాల్లో ఆరోగ్య తనిఖీలు చేయించుకునేందుకు ప్రజలు ఉత్సాహం కనబరుస్తున్నారు. గురువారం శిబిరాలకు వచ్చిన వారికి వైద్య సిబ్బంది మెరుగైన సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. ఊరూరా అందుబాటులోని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను కోరుతున్నారు. ఉన్న ఊరిలోనే ఉచితంగా వైద్యం అందుతుండడంతో ప్రజలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్.



బొబ్బిలి: మల్లంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగికి ఈసీజీ చేస్తుండడాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



మల్లంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సుగర్ టెస్ట్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి



మెంటాడ: కుంటినవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు



రాజాం: ముద్దాడజోగివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింట సర్వేలో వైద్యారోగ్య సిబ్బంది

పక్కదారి పట్టిన ఎస్‌ఎల్‌ఎఫ్ నిధులు

- పురుషుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- అవాక్కయిన మెప్మా అధికారులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస ఎస్‌ఎల్‌ఎఫ్ (స్లమ్ లెవల్ ఫెడరేషన్) నిధులు పక్కదారి పట్టాయి. ఎస్‌ఎల్‌ఎఫ్ పరిధిలోని సంఘాల సభ్యులు ప్రతి నెలా రూ.10 పొదుపులకు సంబంధించి, గురువారం గ్రామంలో మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం, సీవో దానాలమ్మ ఆధ్వర్యంలో సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎల్‌ఎఫ్‌లో నిధుల నిల్వలపై చర్చించారు. ఉండాల్సిన మొత్తాలను ఎవరెవరు రుణాల రూపంలో తీసుకున్నారన్న దానిని చదివి వినిపించారు. ఇదిలా ఉండగా, అన్నమ్మ పేరంటాలు ఎస్‌హెచ్‌జీ తరఫున 2020 జూన్ 24న రూ.31 వేలు, 2020 అక్టోబరు 14న రూ.1.10 లక్షలు ఎస్‌ఎల్‌ఎఫ్ ద్వారా రుణం తీసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ఒక్కసారిగా విస్తుపోయిన సభ్యులు తమకు ఈ రుణాలు ఇవ్వలేదని, తమకు తెలియకుండానే తమ సంఘం పేరిట రుణం వాడుకున్నారని అధికారుల ఎదుట వాపోయారు. గతంలో లోను(రుణం) మొత్తాన్ని కూడా తమ పేరు మీద వాడుకున్నారని, ఇప్పుడు ఈ డబ్బులు కూడా ఇలా మాయం చేయడం వెనక ఆర్‌పీ, బ్యాంకు సిబ్బంది హస్తం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. అలాగే ఎస్‌ఎల్‌ఎఫ్ ఖాతాలో సుమారు రూ.14 లక్షలు ఉండాల్సి ఉండగా, ఆ మొత్తం లేకపోవడంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టనున్నామని అధికారులు తెలిపారు.

ముగ్గురి ఖాతాలకు..

గ్రామసంఘాల నిధులు మహిళల ఖాతాలకే జమ చేయాల్సి ఉన్నప్పటికీ ముగ్గురు పురుషుల ఖాతాలకు జమ అయినట్లు మెప్మా అధికారులు గుర్తించారు. 2021 మార్చి 31న ఎల్.నారాయణరావుకు రూ.20 వేలు, 2021 మే 1న ఎం.వెంకటరావుకు రూ.10 వేలు, 2021 జూలై 14న చంద్రశేఖరరావు వావిలపల్లి ఖాతాకు రూ.13,150తో పాటు ఆర్‌పీగా వ్యవహరిస్తున్న శాసపు ఉమాదేవి ఖాతాకు 2020 డిసెంబర్ 31న రూ.50,170 జమ అయినట్లు అధికారులు గుర్తించారు. మహిళా సంఘాల సొమ్ము మహిళలకే ఇవ్వాల్సి ఉండగా, పురుషుల ఖాతాలకు ఎందుకు జమచేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై బ్యాంకు అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నిర్వహించే ఈ సమావేశానికి రావాలని ముందుగానే ఆర్‌పీలకు అధికారులు సమాచారం అందించారు. అయినప్పటికీ వారు సమావేశానికి డుమ్మా కొట్టడంతో వారే ఈ మొత్తాలను పక్కదారి పట్టించారని మహిళలంతా ఆరోపించారు. ఎవరికి వ్యక్తిగతంగా డబ్బులు కావాల్సి ఉన్నా సభ్యులందరూ ఉండాలని చెప్పేవారని, ఇప్పుడు చూస్తే ఎవరికీ సంబంధం లేకుండా సంఘాల పేరిట నగదు విత్‌డ్రా ఎలా అయిందని తలలు పట్టుకుంటున్నారు. పొదుపు డబ్బులు, లోనులతో పాటు ఎస్‌ఎల్‌ఎఫ్ నిధులను కాజేసిన ఆర్‌పీలపై చర్యలు తీసుకోవాలని బాధితులంతా కోరుతున్నారు.

సంక్షిప్తంగా...

నేడు సంతకవిటిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సంతకవిటి: మండల కేంద్రంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు గురువారం తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని 3 నుంచి 12 వార్డులతో పాటు 15, 16, 30, 31వ వార్డుల్లో తాగునీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద పాడైన తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఈ సమస్య తలెత్తుతోందని, బాధిత ప్రాంతాల ప్రజలు సహకరించాలన్నారు.

నవదుర్గ ఆలయ ఆదాయం లెక్కింపు రేపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయ హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని శనివారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో పి.శ్యామలరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, భక్తుల సమక్షంలో హుండీలు తెరిచి, ఆదాయం లెక్కిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు కూడా పాల్గొనవచ్చన్నారు.

బాణసంచా సామగ్రి స్వాధీనం

రేగిడి: అక్రమంగా తరలిస్తున్న బాణసంచా సామగ్రిని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఇదే ఘటనకు సంబంధించి, మండలంలోని కొత్తచెలికానివలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశామన్నారు. దీపావళి పురస్కరించుకుని, అక్రమంగా బాణసంచాలు తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీఆర్‌వోలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇద్దరు వీఆర్‌వోలపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. వారు అందుబాటులో ఉండడం లేదని, ఎప్పుడు తాము సచివాలయానికి వెళ్లినా తహసీల్దారు కార్యాలయంలో పనులున్నాయని చెబుతూ వెళ్లిపోతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దారు, ఆర్‌డీవోలతో మాట్లాడి, వారు విధుల్లో ఉండేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఓటరు జాబితా ప్రదర్శన

బొబ్బిలి: స్థానిక తహసీల్దారు, ఆర్‌డీవో కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితా గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దారు డోల రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ ఓటరు తమ ఓటుహక్కు ఉందో లేదో ఓసారి తమ గ్రామ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసే ముసాయిదా ఓటరు జాబితాలో చూసుకోవాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందేలా అవగాహన కల్పించాలని, అర్హులతో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేయించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

రేగిడి: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ, సింహాచలం అన్నారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో సర్పంచ్ కరణం గోవిందరావు తన మూడెకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ వేసిన వరి పంటను మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణతో కలిసి గురువారం వారు పరిశీలించారు. పంటకు తెగుళ్లు రాకుండా ఘన, ద్రవ జీవామృతం వినియోగించడం ద్వారా ఆరోగ్యవంతమైన పంటతో పాటు పంట ఏపుగా పెరిగిందని, ఎకరాకు 30 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు ఆనందం వ్యక్తం చేశారు.